సాక్షి
నంద్యాల
శుక్రవారం : 12 : మే : 2023



దత్తాత్రేయ స్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: లోక కల్యాణం కోసం శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి గురువారం విశేషపూజలు నిర్వహించారు.



సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు గురువారం 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీకి 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



ఖాదర్ లింగస్వామి దర్గా కిటకిట

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాను దర్శించుకునేందుకు గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

న్యూస్‌రీల్

ప్రజల వద్దకే వైద్యసేవలు

- డీఎంహెచ్‌ఓ వెంకటరమణ



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాల(రూరల్): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌తో ప్రజల వద్దకే వైద్య సేవలు చేరుతున్నాయని నంద్యాల డీఎంహెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. గురువారం మండలంలోని చాపిరేవుల పీహెచ్‌సీ పరిధిలోని పాండురంగాపురంలో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేసి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైరిస్క్ ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి 108లో సమీప ఆసుపత్రికి చేర్చాలని సిబ్బందికి సూచించారు. అలాగే గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం వంద శాతం సాధించాలని సూచించామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు శశాలం, ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీశ్, ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

బొమ్మలసత్రం: పెండింగ్ కేసుల పరిష్కారం కోసం కక్షిదారులు మెగా లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ చిన్న తగాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా సత్వర న్యాయం జరిగేందుకు లోక్‌అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. కేసులు కోర్టులో ట్రయల్‌కు రావటానికి ఎంతో సమయం వేచి చూడాల్సి ఉందని, దీంతో డబ్బు, కాలం వృథా అవుతుందన్నారు. రాజీ ద్వారా ఒకరికొకరు స్నేహపూరితంగా సమస్యను పరిష్కరించుకుంటే ద్వేషాలు దూరం చేసుకుంటారని పేర్కొన్నారు.

మిర్చి కొనుగోళ్లపై నేడు సమావేశం

నంద్యాల(అర్బన్): మిర్చి కొనుగోళ్లపై కోల్డ్ స్టోరేజ్ వ్యాపారులతో శుక్రవారం సమావేశం నిర్వహిస్తామని ఉప మార్కెటింగ్ సంచాలకులు కల్పన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి ఆధ్వర్యంలో కలెక్టర్ చాంబర్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే సమావేశానికి నంద్యాల పరిసర ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజ్ వ్యాపారులు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలకు ప్రతి నెలా బిల్లుల చెల్లింపు

- పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్



సమీక్షలో మాట్లాడుతున్న పీఆర్ ఈఎన్‌సీ బాలునాయక్

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ ప్రాధాన్యత (గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్) భవన నిర్మాణాలకు నిధుల కొరత లేదని, ప్రతి నెలా బిల్లులు చెల్లిస్తున్నట్లు పీఆర్ ఇంజినీరు ఇన్ చీఫ్ బాలునాయక్ తెలిపారు. గురువారం కర్నూలుకు వచ్చిన ఆయన స్థానిక జిల్లా పరిషత్‌లోని పీఆర్ ఎస్‌ఈ కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన గడువు మేరకు సెప్టెంబర్ నెలాఖరు నాటికి నిర్మాణంలో ఉన్న అన్ని భవనాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. రూఫ్ లెవెల్, ఫినిషింగ్ స్టేజీలో ఉన్న నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇటీవలే ప్రభుత్వం రూ.18 కోట్లను విడుదల చేసిందని, ఇందులో ప్రాధాన్యత భవనాలకు రూ.16.96 కోట్లు, సీసీ రోడ్లకు రూ.2.37 కోట్లు కేటాయింపులు ఉన్నాయన్నారు. పార్ట్ హోల్ ప్రాజెక్టు కింద జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన బీటీ రోడ్లు, ప్యాచ్ పనులకు కూడా మరో రెండు వారాల్లో బిల్లులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. బిల్లులు రావడం లేదనే అపోహను వీడి క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని పనులను వేగవంతం చేయాలన్నారు. పీఎంజీఎస్‌వై కింద కూడా జిల్లాకు ఏడు పనులు మంజూరయ్యాయన్నారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్‌ఈ కే సుబ్రమణ్యం, కర్నూలు, ఆదోని ఈఈలు ఎస్‌సీఈ మద్దన్న, వెంకటప్రసాద్, డీఈఈలు మహేశ్వరరెడ్డి, చౌడేశ్వరరావు, పీఏ టు ఎస్‌ఈ బీ శ్రీనివాసులు, నాగిరెడ్డి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శుద్ధజలం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ ఆర్వోప్లాంట్లు ఏర్పాటు
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సురక్షిత నీరు
- సొంత భవనాలు ఉన్నవాటికి మొదటి ప్రాధాన్యత
- జిల్లాలో మొదటి విడతగా 641 ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు

విద్య, వైద్య రంగానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం మాతాశిశు సంరక్షణ విభాగంలో సమూల మార్పులు తెస్తోంది. ఈ క్రమంలో అంగన్‌వాడీలు సరికొత్త రూపును సంతరించుకుంటున్నాయి. నాడు –నేడు పనులతో అంగన్‌వాడీ భవనాలను ఆధునీకరిస్తూ మెరుగైన సౌకర్యాలను కల్పిస్తోంది. ఓ వైపు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందిస్తోంది. అదే తరుణంలో శుద్ధజలం అందుబాటులో ఉంచేందుకు మినీ ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది.

నందికొట్కూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టింది. గతంలో అవస్థలు పడిన గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇప్పుడు సరికొత్త సౌకర్యాలను పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాతాశిశు సంరక్షణ కోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాలతో పాటు ఫోర్టిఫైడ్ బియ్యం అందించడం లాంటి కార్యక్రమాలను పక్కాగా అమలు చేస్తోంది. ఈ క్రమంలో తల్లులు, చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సురక్షిత మంచినీరు అందుబాటులో ఉండేలా మినీ ఆర్వోప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మధ్యాహ్న భోజన సమయాన శుద్ధజలం ఇవ్వడమే లక్ష్యంగా ఈ బృహత్తర కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో 8 ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా వాటి పరిధిలో 1,663 అంగన్‌వాడీ కేంద్రాలు, 43 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో సొంత భవనాలు ఉన్న కేంద్రాలు 641, అద్దె భవనాలు 791, ఉచిత భవనాలు 231 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 0–6 సంవత్సరాల వయస్సున్న పిల్లలు 98,829 మంది ఉన్నారు. గర్భిణులు 14,305 మంది, బాలింతలు 13,061 మంది ఉన్నారు. అయితే మొదటి విడతగా సొంత భవనాలు, విద్యుత్ సౌకర్యం ఉన్న 641 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆర్వో ప్లాంట్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే 85 కేంద్రాల్లో ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేయగా, మిగిలిన 556 కేంద్రాల్లో పనులు జరుగుతాయని ఏపీడబ్ల్యూఐడీ అధికారులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఏపీ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్



10 బొల్లవరం గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో అమర్చిన మినీ ఆర్వో ప్లాంట్

డెవలప్‌మెంట్ ఈ ఆర్వోప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. ప్లాంట్ల నిర్వహణ బాధ్యతను ఐదేళ్ల పాటు సంబంధిత కంపెనీలే చూసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. త్వరలోనే అన్ని కేంద్రాల్లో ఆర్వోప్లాంట్ల ఏర్పాటు పూర్తి కానుంది.

ఒక్కో ఆర్వోప్లాంటుకు రూ.24 వేలు..

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న మినీ ఆర్వోప్లాంట్‌కు సంబంధించి ఒక్కొక్క ప్లాంట్‌కు రూ. 24 వేల చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయనుంది. 15 లీటర్ల సామర్థ్యం ఉన్న ప్లాంట్ గంటకు 12 లీటర్ల నీటిని శుద్ధి చేస్తుంది. కేంద్రాల్లో నీటి సౌకర్యం ఉంటే పైపుల ద్వారా ప్లాంట్లకు నీటిని నింపి శుద్ధి చేస్తారు. నీటి సౌకర్యం లేని చోట ఆర్వోప్లాంట్‌కు అమరించిన స్టీల్ బాక్స్‌లో నీటిని పోస్తే శుద్ధి చేసిన తరువాత ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టారు.



తాగేందుకు ఆర్వో వాటర్ పట్టుకుంటున్న చిన్నారి

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు హర్షణీయం



చిన్నారులు, బాలింతలు, గర్భిణిలకు శుద్ధజలం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం హర్షణీయం. గతంలో అంగన్‌వాడీలను ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చెందుతున్నాయి. సౌకర్యాలు బాగుంటున్నాయి.

– శిరీష చెలిమిల్ల గ్రామం, పాములపాడు మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



అంగన్‌వాడీ కేంద్రాలకు మినీ ఆర్వో ప్లాంట్ల ద్వారా మంచి నీరు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. పిల్లలకు బలమైన ఆహారంతో మంచినీరు ఇవ్వడం ఎంతో మేలు. కలుషిత నీరు తాగి అనారోగ్యాల బారిన పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టడం బాగుంది.

– షబీనా, వీరాపురం గ్రామం, కొత్తపల్లి మండలం

దశల వారీగా అన్ని కేంద్రాల్లో ఏర్పాటు

జిల్లా వ్యాప్తంగా సొంత భవనాలు, విద్యుత్, నీటి సౌకర్యం ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేస్తుంది. మొదటి విడతగా 641 ఆర్వోప్లాంట్లు మంజూరయ్యాయి. కాగా జిల్లాలో నియోజకవర్గానికి 20 చొప్పున కేటాయించగా ఇప్పటికే 85 అంగన్‌వాడీ కేంద్రాలకు అమర్చాం. మిగిలిన 556 కేంద్రాల్లో ఆర్వోప్లాంట్లు దశల వారీగా ఏర్పాటు చేస్తాం.

– చంద్రకళ ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ

వ్యవసాయంలో శాస్త్ర సాంకేతికతను వినియోగించుకోవాలి



కవర్ పద్ధతిలో పండించిన మామిడి పండ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ఎస్.మీరా, తదితరులు

బనగానపల్లెరూరల్: శాస్త్ర సాంకేతికను వినియోగించుకుని వ్యవసాయంలో సరికొత్త మార్పులు తీసుకురావాలని భారత వ్యవసాయ పరిశోధనా మండలి, వ్యవసాయ సాంకేతికత వినియోగ పరిశోధన సంస్థ డైరెక్టర్ జోన్–10 డాక్టర్ ఎస్. మీరా అన్నారు. గురువారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని శాస్త్రవేత్తలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే సెక్రటరీ పి.బాలాజీ ఆధ్వర్యంలో జరిగిన రైతుల ముఖాముఖి కార్యక్రమంలో డాక్టర్ ఎస్. మీరా మాట్లాడుతూ వ్యవసాయంలో వస్తున్న నూతన సాంకేతికతను యువత అందిపుచ్చుకొని వ్యవసాయరంగాన్ని అభివృద్ధి వైపు నడిపించాలన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలను అనుగుణంగా పంటలు పండించి తద్వారా అధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జేవీ ప్రసాద మాట్లాడుతూ సహజ వ్యవసాయ పద్ధతిలో పండించి ఉత్పత్తులకు అవసరమైన ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకుంటే మార్కెట్‌లో ఆదరణ మరింత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కేవీకేలో ఉన్న వివిధ ప్రదర్శన యూనిట్లను డాక్టర్ మీరా సందర్శించి, వాటి వివరాలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కేవీకే తయారు చేసిన కోడిగుడ్లు పొదిగే యంత్రాన్ని, కవర్ల పద్ధతుల ద్వారా పండిన మామిడి పండ్లను, సహజ పద్ధతుల్లో పండించిన పలు ధాన్యాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ ధనలక్ష్మి, శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, రవిగౌడ్, లక్ష్మీ ప్రియ, ఆదినారాయణ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

డయాసిస్ అభివృద్ధికి తోడ్పాటునందించాలి

- డయాసిస్ రైట్ రెవ. బిషప్ పుష్పలలిత
- ముగింపు ఉత్సవాల్లో పాల్గొన్న ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లాండ్ ప్రతినిధులు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల డయాసిస్ అభివృద్ధికి తోడ్పాటునందించాలని డయాసిస్ రైట్ రెవ. బిషప్ పుష్పలలిత కోరారు. స్థానిక హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్–2 ఆల్‌సెయింట్ చర్చిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న నంద్యాల డయాసిస్ ఫెస్టివల్ ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఉత్సవ కార్యక్రమానికి ఇంగ్లాండ్ ప్రతినిధులు రెవ సారా, రెవరెండ్ జేమ్స్, గావిన్ ఆండ్రూ కొలిన్ బిషప్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డయాసిస్ బిషప్ పుష్పలలిత మాట్లాడుతూ డయాసిస్ పరిధిలో ఉన్న బాలబాలికల హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పన, సెయింట్ వెర్‌బర్గ్ ఆసుపత్రుల అభివృద్ధికి సాయం అందించాలన్నారు. ఇంగ్లాండ్ ప్రతినిధులు ఇందుకు సానుకూలంగా స్పందించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఎస్ఐ సీనాడ్ డైరెక్టర్ రెవ.జస్టిన్ మిషన్, యూత్ డైరెక్టర్ పి.సుధాకర్, నంద్యాల డయాసిస్ ఉపాధ్యక్షులు రెవ. వరప్రసాద్, పాస్టరేట్–2 డీనరి చైర్మన్ సామేల్ రత్నరాజ్, పాస్టరేట్–1 చైర్మన్ జోసెఫ్, సెక్రటరీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న బిషప్ పుష్పలలిత

నేడు ఉచిత సామూహిక సేవలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ధర్మప్రచారంలో భాగంగా శుక్రవారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉచిత సామూహిక సేవలలో భాగంగా కుంకుమార్చనను ఏర్పాటు చేసినట్లు దేవస్థానం ఈఓ ఎస్ లవన్న తెలిపారు. రేషన్‌కార్డు కలిగిన సామాన్య భక్తులు నెలలో ఒకసారి ఉచిత సామూహిక సేవలను జరిపించుకునే అవకాశాన్ని దేవస్థానం కల్పించిందని, సామూహిక సేవలో పాల్గొనే భక్తులు www.srisailadevastanam.org ద్వారా ముందస్తుగా నమోదు చేసుకోవాలన్నారు. కాగా శుక్రవారం 9 గంటలకు అక్క మహాదేవి అలంకార మండపంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ సామూహిక కుంకుమార్చనకు 220 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారన్నారు.

వేలానికి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కోర్టు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆత్మకూరు డివిజన్ కొక్కెరంచ మంచినీటి పథకం పనులు చేసిన కాంట్రాక్టర్‌కు బకాయిపడిన సొమ్మును జూన్ 30వ తేదీలోగా చెల్లించకుంటే ఆర్‌డబ్ల్యూఎస్ సర్కిల్ కార్యాలయ భవనాన్ని వేలం వేస్తామని జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలు ... 2008లో కొక్కెరంచ మంచి నీటి పథకం , ఇతర హ్యాబిటేషన్ పనులను పులిపాటి ఇంజనీర్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పులిపాటి పాపయ్య రూ.5.82 కోట్లతో పనులు చేపట్టారు. ఈ క్రమంలో చేసిన పనులకు అప్పట్లోనే కొంత మేర బిల్లులు చెల్లించిన ప్రభుత్వం పనుల్లో వ్యత్యాసం ఉందని ఫైనల్ బిల్లును నిలిపి వేసినట్లు సమాచారం. తాను చేసిన పనులకు చివరి బిల్లు రూ.1,50,13,816 రావాల్సి ఉందని కాంట్రాక్టర్ కోర్టులో కేసు వేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు వాయిదా పడుతూ వస్తున్న ఈ కేసుపై జిల్లా న్యాయస్థానం జూన్ 30వ తేదీలోగా సదరు కాంట్రాక్టర్‌కు రూ.3,55,23,432 చెల్లించాలని, లేని పక్షంలో భవనాన్ని వేలం వేయాల్సి వస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన డబ్బుకు సంబంధించిన ఫైల్ ఆర్థిక శాఖ వద్ద ఉందని, అక్కడి నుంచి క్లియరెన్స్ రాగానే చెక్కు రూపంలో బకాయిలను చెల్లిస్తామన్నారు.

పకడ్బందీగా విద్యాకానుక కిట్ల పంపిణీ

- పాఠశాల పునఃప్రారంభం రోజు నుంచే పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం రోజు నుంచే జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో రెమిడియల్ తరగతులు, నాడు–నేడు ప్రగతి పనులపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రెమిడియల్ తరగతులు ప్రారంభించి రోజూ మూడు సబ్జెక్టులను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెమిడీయల్ తరగతుల నిర్వహణపై ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతులు జూన్ 10వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో పెద్ద, చిన్న మరమ్మతులు, కిచెన్ షెడ్, రూఫ్ సీలింగ్, టాయిలెట్ల నిర్మాణం, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నిచర్, పాఠశాలకు పెయింటింగ్, ఆకుపచ్చ సుద్ద బోర్డులు తదితర 8 రకాల పనులు గడువులోగా వంద శాతం పూర్తి కావాలన్నారు. నాడు–నేడు పనులకు నిధుల కొరత లేదని, పనుల ప్రగతిపై రోజు ఫొటోలు పంపాలన్నారు. నిర్మాణ పనులకు మెటీరియల్ కొరత లేకుండా ఎప్పటికప్పుడు ఇండెంట్ ఇచ్చి తెప్పించుకోవాలన్నారు. పాఠశాల ప్రారంభం రోజు నుంచే జగనన్న విద్యా కిట్లను ప్రతి విద్యార్థికి బయోమెట్రిక్ హాజరుతో సమానంగా కిట్లను పంపిణీ చేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత అడ్మిషన్ల భర్తీ నిమిత్తం విస్తృత ప్రచారం కల్పించి తల్లిదండ్రుల్లో అవగాహన తీసుకురావాలన్నారు. గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా సర్వే చేయించి, వారి తల్లిదండ్రులకు ప్రైవేటు పాఠశాలలో కూడా ఉచిత అడ్మిషన్లు జరిగేలా చూడాలన్నారు. 1వ తరగతి నుంచి ఐదో తరగతి కోసం అడ్మిషన్లు తీసుకునేటప్పుడు వారి ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ తీసుకోవాలని, అడ్మిషన్ తీసుకునే తరగతికి తగు వయోపరిమితి ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష అభియాన్ సెక్టోరల్ అధికారి లలిత, ఇన్‌చార్జ్ డీఈఓ బేగ్, డోన్ డిప్యూటీ డీఈఓ క్రిష్టఫర్, లైజన్ ఆఫీసర్ దానం, సమగ్ర శిక్షా ఈఈ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మెనూ మార్చేసిన మధుమేహం

- జిల్లా జనాభాలో 25 శాతం షుగర్ వ్యాధిగ్రస్తులు
- ప్రతిరోజు 7 వేలకు పైగా రోగులు వైద్యుల వద్ద చికిత్స
- ఆహార నియంత్రణతో మారిన మెనూ
- సిరిధాన్యాలతో చేసిన పదార్థాలకు ఆదరణ

నంద్యాల(అర్బన్): జొన్న, రాగి సంకటి, కొర్రలు, ఊదలు, అరికెలు నాడు కేవలం పేదలు మాత్రమే ఆహారంగా తీసుకునేవారు. ఇది 45 ఏళ్ల క్రితం నాటి పరిస్థితి. షుగర్ వ్యాధి కాలాన్ని తిరగరాసింది. నాటి పేదల ఆహారం నేటి పెద్దలు, మధ్య తరగతి వారి పళ్లెంలోకి వచ్చి చేరింది. డయాబెటీస్ కారణంగా తమ మెనూలో పాత కాలం నాటి వంటకాలకు చోటు కల్పిస్తున్నారు. షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జిల్లా జనాభాలో 25 శాతం మంది వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. నంద్యాల ప్రభుత్వాసుపత్రితో పాటు ప్రైవేటు, ప్రధాన పట్టణాల్లోని ఆసుపత్రులకు నెలలో వేలాది మంది డయాబెటిస్ రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. జిల్లాలో విక్రయించే ఔషధాల్లో షుగర్ మందులదే ప్రథమ స్థానం ఉందంటే అతిశయోక్తి కాదు. ప్రతి షుగర్ వ్యాధిగ్రస్తుడు మందులు, చికిత్స, ఆహారానికి సగటున నెలకు రూ. 6 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. చికిత్సతో పాటు ఆహారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. మధుమేహం బారిన పడిన వారు ఆహార నియంత్రణలో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొన్ని పదార్థాలు మితంగా తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. వైద్యుల సూచనలు, సోషల్ మీడియాలో వస్తున్న వివిధ అంశాలు సైతం వ్యాధిగ్రస్తులను పాత మెనూ వైపు మళ్లిస్తున్నాయి. అందుకే సన్న బియ్యానికి జనం క్రమంగా దూరమవుతున్నారు. సిరి ధాన్యాలు, రాగులు, జొన్నలు, గోధుమలు, కూరగాయలు, పండ్లు, ఆహారంలో చేర్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో షుగర్ వ్యాధిగ్రస్తుల మెనూతో హోటళ్లు కూడా వెలుస్తున్నాయి. రాగి ఇడ్లీ, కొర్ర దోస స్పెషల్ అంటూ బోర్డులు పెడుతున్నారు.



పోషకాలు కలిగిన సిరి ధాన్యాలు

సిరి ధాన్యాలపై మొగ్గు..

షుగర్ రోగులతో పాటు ఇతరులు సైతం సిరి ధాన్యాలతో వండిన ఆహార పదార్థాలపై మొగ్గు చూపుతున్నారు. పంట దిగుబడి తక్కువగా ఉండటం , తినేవారు అధికం కావడంతో వీటి ధర అమాంతం పెరిగింది. ఒకప్పుడు కిలో రూ.20కి లభించే కొర్రలు ఇప్పుడు రూ.70, 80 మధ్యకు చేరుకున్నాయి. ఇతర సిరి ధాన్యాల ధరలు రూ.80 నుంచి రూ.200లకు పైగానే విక్రయిస్తున్నారు. షుగర్ వ్యాధి నియంత్రణకు పలువురు నేరేడు, జామ, ఉసిరిని తమ మెనూలో చేర్చారు. అలాగే డ్రాగన్‌ఫ్రూట్స్, కివీస్ పండ్లను తింటున్నారు. దీంతో వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. నేరేడు పండ్ల ధర కిలో రూ.180 నుంచి రూ.200 దాకా పలుకుతుంది.

ప్రతి వీధిలో జొన్నరొట్టె విక్రయాలు..

షుగర్ వ్యాధి కారణంగా చాలా మంది వరి అన్నం తినడం తగ్గించి ఒక పూట జొన్నరొట్టెలు తింటున్నారు. దీంతో వీటికి ఆదరణ పెరిగింది. ఇళ్లలో జొన్న రొట్టెలు చేసే వారు తగ్గిపోవడంతో హోటళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ మేరకు ప్రతి వీధిలో జొన్న రొట్టె విక్రయ కేంద్రాలు వెలుస్తున్నాయి. పలువురు మహిళలు జొన్న రొట్టె విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. రొట్టెలతో పాటు కర్రీ పాయింట్‌లు నిర్వహిస్తున్నారు. ఒక్కో రొట్టె రూ.12 నుంచి రూ.15 వరకు విక్రయిస్తున్నారు.



రొట్టెలు తయారు చేస్తున్న నిర్వాహకులు

రొట్టెల అమ్మకాలతో ఉపాధి

ఒక్కో రొట్టె రూ.12 ప్రకారం ప్రతిరోజూ 200 నుంచి 250 దాకా అమ్మకాలు జరుగుతున్నాయి. గత నాలుగేళ్లుగా రొట్టెల అమ్మకాలతోనే ఉపాధి పొందుతున్నాం. గతంలో 80 నుంచి 100 లోపు అమ్మకాలు జరిగేవి. మధుమేహ వ్యాధిగ్రస్తులు అధికం కావడంతో రొట్టెల అమ్మకాలు రెట్టింపు అయ్యాయి. నేను ఉపాధి పొందుతూ మరో ఇద్దరికి ఉపాధి చూపుతున్నా.

– దస్తగిరమ్మ, బాలాజీ కాంప్లెక్స్, నంద్యాల

ఆహార నియంత్రణ పాటించాలి



మనిషి ఆహారపు అలవాట్లు, జీవన శైలిలో మార్పులు వచ్చాయి. అందుకే షుగర్ వ్యాధిగ్రస్తులు పెరిగిపోతున్నారు. పోషకాహారం తీసుకోకుండా సులభంగా లభించే ఆహారం వైపు మొగ్గు చూపుతుండటంతో ఇందుకు కారణం. క్రమ పద్ధతిలో ఆహారాన్ని తీసుకుంటే ఎంతటి షుగర్ వ్యాధి అయినా నియంత్రణలోకి వస్తుంది. ఆకుకూరలు, కూరగాయలు, పరిమితమైన పండ్లు తీసుకుంటే వ్యాధిని దూరంగా ఉంచవచ్చు. జొన్నలు, కొర్రలు, రాగులు, ముడి బియ్యం వంటి పదార్థాలు షుగర్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. మితాహారం తీసుకుంటూ పరిమితమైన వ్యాయామం చేస్తే షుగర్ వ్యాధి ఉన్నా హాయిగా జీవించవచ్చు.

– డాక్టర్ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల

అప్పులబాధ తాళలేక..


నీరుకట్టు సురేష్‌బాబు (ఫైల్)

పాణ్యం: వడ్డుగండ్ల గ్రామానికి చెందిన నీరుకట్టు సురేష్ బాబు (40) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనకున్న రెండెకరాలతో పాటు మరో 8 ఎకరాలు పొలం కౌలుకు సాగు పలు పంటలు సాగు చేశాడు. కాగా ఏటా నష్టం రావడంతో పెట్టుబడికి తెచ్చిన అప్పులు రూ. 15 లక్షలయ్యాయి. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కేక్ కోసం వచ్చి మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో పాలిటెక్నిక్ విద్యార్థి దుర్మరణం
- మరో ఇద్దరు చిన్నారులకు గాయాలు


మల్లికార్జున (ఫైల్)

బనగానపల్లెరూరల్: తమ బంధువుల అమ్మాయి జన్మదినం సందర్భంగా కేక్ కొనుగోలు చేసేందుకు వచ్చిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. మరో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అవుకు మండలం లింగంబోడు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, సరోజ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు మల్లికార్జున (21) కర్నూలులో పాలిటెక్నిక్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం తమ బంధువుల అమ్మాయి బర్త్‌డే సందర్భంగా కేక్ కొనుగోలు చేసేందుకు ఇద్దరి చిన్నారులతో కలసి మల్లికార్జున బైక్‌పై బనగానపల్లెకు వచ్చాడు. కేక్‌తో స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా పట్టణ శివారులోని షిరిడీ సాయిబాబా ఆలయం సమీపంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్, బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మల్లికార్జునతో పాటు మరో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం బనగానపల్లె ఆసుపత్రికి తరలించారు. మల్లికార్జున పరిస్థితి విషయంగా ఉండటంతో సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వెంటనే తన సొంత వాహనంలో నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైద్యశాలకు చేరుకొని మృతుడి తల్లిదండ్రులను పరామర్శించారు. లింగంబోడు గ్రామం తన సొంత గ్రామంలాంటిదని, మృతుడి కుటుంబీకులకు తనవంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామిరెడ్డి గురువారం తెలిపారు.


కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రియురాలిని హత్య చేసిన ప్రియుడు

- పరారీలో హంతకుడు


హత్యకు గురైన సుధారాణి (ఫైల్)

కర్నూలు: నగర శివారు కోడుమూరు రోడ్డులోని గురురాఘవేంద్రనగర్‌లో నివాసముంటున్న సుధారాణి (45) దారుణ హత్యకు గురయ్యింది. నెల్లూరుకు చెందిన ఈమె భర్తను వదిలేసి మూడేళ్ల క్రితం కర్నూలుకు వచ్చి గురురాఘవేంద్ర నగర్‌లో ఉంటోంది. సమీప కాలనీ శివయ్యనగర్‌కు చెందిన శ్రీనివాసరెడ్డితో పరిచయం పెరిగి మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. శ్రీనివాసరెడ్డి గతంలో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ప్రస్తుతం ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. ప్రియురాలు సుధారాణి తనకు తెలియకుండా రోజుల తరబడి బయటకు వెళ్తుందనే అనుమానం పెంచుకుని కొంతకాలంగా ఆమెతో గొడవ పడేవాడు. గురువారం ఉదయం కూడా ఆమెతో గొడవ పడి ఇంట్లోనే మెడకు చున్నీతో బిగించి హత్య చేశాడు. అనంతరం కడపలో ఇంజనీరింగ్ చదువుతున్న ఆమె మొదటి భర్త కూతురు లేఖకు ఫోన్ చేసి 'మీ అమ్మను చంపేశాను' అని చెప్పి ఇంట్లో నుంచి పరారయ్యాడు. లేఖ పోన్ చేసి చెప్పడంతో నాల్గో పట్టణ సీఐ శంకరయ్య సంఘటనా పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గిరిజన పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మూడు ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 3 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి 3వ తరగతి మినహా 4 నుంచి 9వ తరగతి వరకు ఎస్‌టీ బ్యాక్‌లాగ్ సీట్లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. బ్యాక్‌లాగ్ ఖాళీ సీట్లను జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులతోనే భర్తీ చేస్తామన్నారు. ఆయా పాఠశాలల్లో ప్రవేశం పొందాలనుకునే గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు సంబంధిత పాఠశాలలో ఈ నెల 30వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఖాళీల వివరాలు తరగతుల వారీగా...

పాఠశాల పేరు	టైపు	3వ	4వ	5వ	6వ	7వ	8వ	9వ
ఆలూరు	బాలికలు	40	11	02	00	00	00	00
కర్నూలు	బాలికలు	40	27	20	04	06	00	00
తుగ్గలి	బాలురు	40	35	34	27	07	08	00
మొత్తం:		120	73	56	31	13	08	00

ప్రాణం తీసిన ఈత సరదా

- గని గుంతలో చిక్కుకుని బాలుడి మృతి


ప్రమాదానికి కారణమైన గని గుంత


సాయికృష్ణ (ఫైల్)

మిడుతూరు: తోటి బాలలతో కలిసి సరదాగా ఈత కోసం వెళ్లిన ఓ బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వడ్డె శివ, పార్వతి దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు సాయికృష్ణ(8) నాగలూటి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో స్నేహితులతో కలిసి నంది కొట్కూరు - నాగలూటి రహదారిలో ఉన్న గని గుంతలో ఈతకు వెళ్లారు. గుంతలో ఒండు ఉన్న చోట సాయికృష్ణ చిక్కుకుని నీట మునిగాడు. గమనించిన బాలలు కేకలు వేయడంతో సమీపంలో పని చేస్తున్న గని కార్మికులు అక్కడికి చేరుకున్నారు. వారు గని గుంతలో గాలించగా బాలుడిని గుర్తించి బయటకు తీశారు. కాగా అప్పటికే ఊపిరాడక మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

మద్యం దుకాణంలో చోరీ

- రూ. మూడు లక్షల నగదు అపహరణ
- మద్యం సీసాలను తాకని దొంగలు
- దుకాణ సిబ్బందిపై అనుమానాలు


మద్యం దుకాణం పైకప్పు రేకులను కత్తిరించిన దొంగలు


చోరీ జరిగిన జూపాడుబంగ్లా మద్యం దుకాణం

జూపాడుబంగ్లా: స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణంలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దొంగలు రూ.3,07,000 నగదు అపహరించారు. దుకాణ పైకప్పు రేకులు కత్తిరించి చోరీకి పాల్పడ్డారు. ఈ దుకాణంలో సూపర్‌వైజర్‌గా పరమేష్, సెల్స్‌మెన్స్ సురేష్, రవి, నైట్‌వాచ్‌మెన్‌గా సుబ్బన్న విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం మద్యం విక్రయించగా వచ్చిన రూ.3,07,000 నగదును దుకాణంలోని లాకర్‌లో పెట్టి సూపర్‌వైజర్ పరమేష్ తాళం వేయకుండా వెళ్లాడు. రాత్రి దుకాణం మూసి వెళ్లాక నైట్‌వాచ్‌మెన్ సుబ్బన్న దుకాణం వద్ద నిద్రించాడు. గుర్తుతెలియని దొంగలు మద్యం దుకాణం పైకప్పు రేకులను కత్తిరించి లోపలికి చొరబడ్డారు. దుకాణంలో విలువైన మద్యం సీసాలున్నప్పటికీ వాటిని ఏమాత్రం ముట్టుకోకుండా కేవలం బీరువాలోని రూ.3,07,000 నగదును దోచుకెళ్లారు. తెల్లవారిన అనంతరం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో సేల్స్‌మెన్ సురేష్ మద్యం దుకాణాన్ని తెరవగా బీరువా లాకర్ తెరచి ఉండటాన్ని గమనించి సూపర్‌వైజర్ పరమేష్, మరో సేల్స్‌మెన్ రవికి ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చారు. వారు దుకాణం వద్దకు వచ్చి బీరువాలో డబ్బులు పెట్టి తాళం వేయటం మరిచిపోయానని సూపర్‌వైజర్ తెలిపారు. డబ్బులు ఉంచిన బీరువాకు తాళం వేయకపోవటం, ఒక్క మద్యం సీసా కూడా అపహరించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ అండ్ సెబ్ సీఐ ఖాజామొహిద్దీన్ జూపాడుబంగ్లాకు చేరుకొని మద్యం దుకాణాన్ని పరిశీలించారు. జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దుకాణ సూపర్‌వైజర్ పరమేష్, సేల్స్‌మెన్లు సురేష్, రవిని అదుపులోకి తీసుకున్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయండి

కర్నూలు(అగ్రికల్చర్): వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏవో) పీఎల్ వరలక్ష్మి విత్తన కంపెనీల ప్రతినిధులు, పంపిణీ దారులను ఆదేశించారు. గురువారం కర్నూలు ఏడీఏ కార్యాలయంలోని జిల్లాలోని కూరగాయల విత్తన కంపెనీలు, హైబ్రిడ్ విత్తన కంపెనీలు, బీటీ పత్తి విత్తన కంపెనీల యజమానులు, ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిబంధనల ప్రకారం విత్తనాలు కంపెనీ నుంచి పంపిణీదారుకు, అక్కడి నుంచి డీలరుకు చేరాలన్నారు. పంపిణీదారు నుంచి ఏ డీలరుకు ఏ విత్తనాలు ఎంతెంత ఇచ్చారో రెండు వారాల్లో పూర్తి వివరాలు ఇవ్వాలని కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. బీటీ పత్తి విత్తనాలకు సంబందించి కంపెనీలు, పంపిణీదారులు ఎంఆర్‌పీ రూ.853 చూపుతున్నాయని, ఇది పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, సాంకేతిక ఏవో రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార పెట్టుబడికి తండ్రి డబ్బు ఇవ్వలేదని..

- కుమారుడి ఆత్మహత్య

కర్నూలు: వ్యాపార పెట్టుబడికి తండ్రి ఆరెపోగు వెంకటేశ్వర్లు రూ.10 లక్షలు డబ్బు ఇవ్వలేదని మనస్తాపానికి గురై కుమారుడు ఆరెపోగు జయకర్ (25) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు మండలం మాసామసీదు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు హమాలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు సంతానం. కుమారుడు జయకర్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. గౌండా పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కొంతకాలంగా మద్యానికి అలవాటు పడ్డాడు. వారం క్రితం పిజ్జా దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు తనకు రూ.10 లక్షలు ఇవ్వాలని తండ్రిపై ఒత్తిడి తెచ్చాడు. డబ్బు ఇచ్చేందుకు తండ్రి నిరాకరించడంతో మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో జయకర్ ఉరి వేసుకున్నాడు. హమాలీ పని ముగించుకుని ఇంటికి వచ్చిన తండ్రికి కుమారుడు ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు వారి సాయంతో కిందికి దించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. శుక్రవారం ఉదయం కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రామలింగమయ్య తెలిపారు.